క్లుప్తంగా

పోతురాజు విగ్రహావిష్కరణ


ఆవిష్కరించిన పోతురాజు విగ్రహం

బొబ్బిలి: శిర్లి ఎల్లమ్మ, పోతన్న జాతరలో భాగంగా పట్టణంలోని ఎల్లమ్మ తల్లి ఆలయంలో పోతురాజు విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేదపండితులు నిష్టల ధర్మారావు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం అమ్మవారికి బోనాలు సమర్పించి, భక్తులకు అన్నదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ట్రై సైకిళ్లు పంపిణీ


దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహనరావు

సంతకవిటి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరపురపు జగన్‌మోహనరావు చేతుల మీదుగా దివ్యాంగ విద్యార్థులకు సోమవారం ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఆ పార్టీ వారికే పథకాలు అందేవని విమర్శించారు. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.శాంతికుమారి, ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాధరావు

తెర్లాం: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈఓ త్రినాధరావు సూచించారు. మండలంలోని కొల్లివలస ప్రాథమిక పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు, మరుగుదొడ్లు, జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం ప్రతీ తరగతి గదికి వెళ్లిన ఆయన వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలను తెలుసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్యను పెంచాలని, ఆ దిశగా బడిఈడు పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడాలని తెలిపారు.

ఎంపీడీఓ పరిశీలన


పెంట సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట, రంగరాయపురం గ్రామాల్లోని సచివాలయాలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఎంపీడీఓ అల్లు భాస్కరరావు సోమవారం పరిశీలించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి, చెత్త నుంచి తయారు చేసిన ఎరువును రైతులకు రాయితీపై అందించి పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

ఆకట్టుకున్న 'సైన్స్ ఎక్స్ పో'


విద్యార్థుల ప్రాజెక్టులను తిలకిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక చైతన్య స్కూల్‌లో సైన్స్ ఎక్స్ పో కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సైన్స్ ప్రాజెక్టులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం కార్యక్రమానికి విచ్చేసిన మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు విద్యార్థుల ప్రాజెక్టుల పనితీరు అడిగి తెలుసుకుని, వారి సృజనాత్మకతను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఎం వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

వంగర: గ్రామాల్లోని ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బందితో సమావేశమైన ఆయన పీఎంజేఏవై కార్డులు, ఎన్‌సీడీ సర్వే, సఖి, పారిశుద్ధ్యం, ప్రజల ఆరోగ్యం వంటి అంశాలపై సమీక్షించారు. ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని, చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు.

సర్వే జనా శాశ్వత భూ రక్ష!

- చురుగ్గా సమగ్ర భూముల రీసర్వే
- వందల ఏళ్ల భూ తగాదాలు పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం


గుల్లసీతారాంపురంలో సర్వేలో అధికారులు(ఫైల్)


రైతుకు జారీ చేసిన శాశ్వత భూ హక్కు పత్రం

మండలం	సర్వే పూర్తయిన గ్రామాల సంఖ్య
రాజాం:	08
వంగర:	07
సంతకవిటి:	13
రేగిడి:	06

రాజాం: రైతుల మధ్య ఏళ్లతరబడి నెలకొన్న భూ తగాదాలను పరిష్కరించి, వారి భూములకు శాశ్వత భద్రత కల్పించడమే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూముల రీసర్వే చాలా చురుగ్గా జరుగుతోంది. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రైతుల సమక్షంలోనే రెవెన్యూ సిబ్బంది డ్రోన్ సర్వే, గ్రౌండ్ ట్రూతింగ్ చేపట్టి, పక్కాగా పంట పొలాల కొలతలు నిర్ణయిస్తున్నారు. ఇప్పుడే కాదు మరెప్పుడూ అన్నదాతలకు ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా సర్వే చేసి, వారి భూమి వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఆ తర్వాత వారికి శాశ్వత భూ హక్కు పత్రం జారీ చేస్తూ వారి భూములకు రక్షణ కల్పిస్తున్నారు. దీంతో రైతాంగమంతా ప్రభుత్వ పనిని హర్షిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తొలి విడతలో 34 గ్రామాల్లో..

రాజాం నియోజకవర్గంలో తొలి విడతలో 34 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తిచేశారు. సర్వే చేయడంతో పాటు వినతులు స్వీకరించి, నో-అబ్జక్షన్ పత్రాలు జారీ చేసి, రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలు కూడా పంపిణీ చేయడం జరిగింది. ఈ సర్వే ద్వారా భూమి ఉండి, దానికి సంబంధించిన పత్రాలు లేని రైతులు చాలామంది లబ్ధి పొందడమే కాకుండా ప్రస్తుతం తమ పొలాల్లో హద్దులు నిర్ణయించుకుని, చక్కగా వ్యవసాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

ఆక్రమణదారుల ఆగడాలకు అడ్డుకట్ట..



మా పంచాయతీ పరిధిలో కొంతమంది ఆక్రమణదారులు అడ్డుగోలుగా వ్యవహరించి, పక్కా రైతుల పంటపొలాలు చూపించి, తప్పుడు 1-బిలు చేయించుకునేవారు. ఇటీవల జరిగిన భూముల రీసర్వేతో ఆక్రమణదారుల ఆగడాలకు అడ్డుకట్ట పడింది. చాలావరకు ఆక్రమణలు గుర్తించి, తొలగించడం జరిగిది. నిజమైన రైతులకు భూములు చెందాయి.

– వంజరాపు విజయ్‌కుమార్, బొమ్మినాయుడువలస, రాజాం మండలం

16,290 ఎకరాల్లో సర్వే పూర్తి..

రాజాం నియోజకవర్గంలో మొత్తం 1.36 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా, ఇప్పటివరకు 16,290 ఎకరాల్లో సర్వే పూర్తి చేయడం జరిగిందని అధికారులు వెల్లడించారు. 6,498 మంది రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలను అధికారులు పంపిణీ చేశారు. డ్రోన్‌ల ద్వారా సర్వే చేయడంతో నిజమైన భూమి కలిగిన రైతులకు మేలు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

చాలామంచి కార్యక్రమం..



జగనన్న శాశ్వత భూ హక్కు పథకం చాలా మంచి కార్యక్రమం. మా గ్రామంలో పంట పొలాల హద్దుల సమస్యలు ఉండేవి. ఈ పథకం ద్వారా ప్రభుత్వం చేపట్టిన సర్వేతో ఆ సమస్య తీరింది.

– మరిపి ఈశ్వర సత్యనారాయణ, సర్వేయర్, సంతకవిటి మండలం.

అన్నదాతలకు మేలు..



జగనన్న శాశ్వత భూ హక్కు పథకం ద్వారా చాలామంది అన్నదాతలకు మేలు జరుగుతోంది. గతంలో భూ వివాదాల కారణంగా చాలా ప్రాంతాల్లో సమస్యలు వచ్చేవి. పథకంలో భాగంగా చేసే సర్వేతో ఆ సమస్యలు తగ్గుముఖం పట్టాయి.

– కె.విజయ్‌భాస్కర్, తహసీల్దార్, రాజాం.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం


గృహసారథులకు కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ పరిశీలకుడు తిలక్

- ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు తిలక్

రాజాం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలన దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పేరాడ తిలక్ అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని సూర్యదుర్గా కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన రాజాం మండల గృహసారథులతో సమావేశమైన వారు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. దేశంలోని సంపన్న రాష్ట్రాల కన్నా మన రాష్ట్రంలో సువర్ణమైన పాలన కొనసాగుతోందన్నారు. తొలుత ఎమ్మెల్యే జోగులు మాట్లాడుతూ పార్టీ నేతలు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమాన ప్రాధాన్యం కల్పిస్తున్న తీరు, చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించాలని కోరారు. అలాగే ప్రభుత్వంపై విషంచిమ్ముతూ టీడీపీ, ఎల్లోమీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. పార్టీ పరిశీలకుడు తిలక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పక్షపాతి అని, ఆయన తన ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారన్నారు. ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ భవిష్యత్ ఉంటుందని, సీఎం నిర్దేశించిన టార్గెట్-175(175 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ గెలుపు)ని చేరుకోవాలంటే ఇప్పటినుంచే కష్టపడాలని తెలిపారు. అనంతరం గృహసారథులకు కిట్లు అందజేశారు. ఇదిలా ఉండగా, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ వాల్‌పోస్టర్లను నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం మండల కన్వీనర్ ఎల్.రాజగోపాలం, రాజాం పీఏసీఎస్ అధ్యక్షులు వి.చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీలు వై. వెంకటేష్, ఎన్. వర్షిణి, సచివాలయాల మండల కన్వీనర్ కె.శ్రీరంగంనాయుడు, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు


మాట్లాడుతున్న సీఐ రవికుమార్

రాజాం సిటీ: పోలిపల్లి పైడితల్లి జాతర నేపథ్యంలో నెలకొన్న భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపడుతున్నట్లు టౌన్ సీఐ కె.రవికుమార్ తెలిపారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28, మార్చి 1వ తేదీల్లో ట్రాఫిక్ నిబంధనలు అమలులో ఉంటాయని, ఈ క్రమంలో జాతరలోకి వచ్చే భక్తుల వాహనాలకు అనుమతిలేదని తెలిపారు. బొబ్బిలి జంక్షన్ మీదుగా వచ్చే వాహనాలను పోలీస్ క్వార్టర్స్ వద్ద పార్కింగ్ చేయాలని, బొబ్బిలి వైపు నుంచి వచ్చే వాహనాలను మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న స్థలంలో పార్కింగ్ చేయాలని, అలాగే మెంటిపేట మీదుగా వచ్చే వాహనాలను ఆర్ అండ్‌బీ బంగ్లా వద్ద పార్కింగ్ చేయాలని తెలిపారు. బొబ్బిలి రోడ్డులోని వ్యాపారులు, ఇళ్ల యజమానులు రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయకూడదని, రెండు రోజుల పాటు వన్‌వే ట్రాఫిక్‌ను అమలు చేస్తున్నామని సీఐ వివరించారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఈ ఆంక్షలు ఉంటాయన్నారు. మండల పరిధిలోని చీకటిపేట జంక్షన్ నుంచి సాయి డైట్ కళాశాల మీదుగా ఇల్లంనాయుడువలస, బొమ్మినాయుడువలస, జీసీపల్లి మీదుగా జెండాలదిబ్బకు ట్రాఫిక్ మళ్లించనున్నామన్నారు. బొబ్బిలి వైపు వెళ్లే వాహనాలు కూడా బొద్దాం, జీసీపల్లి మీదుగా చీకటిపేట జంక్షన్‌కు చేరుకోవాలని సూచించారు. యాత్రికుల దర్శనానికి అసౌకర్యం కలగకుండా ఈ ఏర్పాట్లు చేశామన్నారు.

మార్చి 2న దాడితల్లి ఆలయ పునఃప్రారంభోత్సవం

బొబ్బిలి: స్థానిక పట్టణంలో దాడితల్లి ఆలయ పునఃప్రారంభోత్సవం మార్చి 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు పిండిప్రోలు మణికుమార్ శర్మ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయ గర్భగుడి గోపురం పునర్నిర్మించామని, ఆలయ పునఃప్రారంభం రోజున పూర్ణ కలశ ప్రతిష్ట, ప్రత్యేక హోమాలు, పూజలు చేస్తారని పేర్కొన్నారు.

నేడు సిరిమానోత్సవం

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో జరుగుతున్న కొత్తపోలమ్మ, పాత పోలమ్మ, నూకాలమ్మ గ్రామదేవతల సంబరాల్లో భాగంగా మంగళవారం సిరిమానోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఐఎఫ్‌పీపై అవగాహన

రాజాం సిటీ: స్థానిక డీఏవీ స్కూల్‌లో డోలపేట, బాలికల పాఠశాల, రాజాం ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ)పై ఉపాధ్యాయులకు సోమవారం అవగాహన కల్పించారు. టచ్‌స్క్రీన్ వినియోగాన్ని ఉపవిద్యాశాఖాధికారి ఎస్.తిరుమలనాయుడు వివరించారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి


ఇంటింటికీ వెళ్లి, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

రాజాం: వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పేరాడ తిలక్ కోరారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వాసవీనగర్‌లో ఇంటింటికీ వెళ్లిన వారు పట్టభద్రులైన ఓటర్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మద్దతు తెలిపిన సుధాకర్‌కు తొలి ప్రాధాన్యతా ఓటు వేసి, గెలిపించి, ముఖ్యమంత్రికి కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం కన్వీనర్ పి.శ్రీనివాసరావు, వి.విజయ్‌కుమార్, ఎస్.శ్రీనివాసరావు, వంగర మండల కన్వీనర్ కె.సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌కు సహకరించండి


సూచనలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమ్

మెంటాడ: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, నిర్వహించే సోషల్ ఆడిట్‌కు సహకరించాలని అని ఎంపీడీఓ త్రివిక్రమ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పనుల సిబ్బందితో సమావేశమైన ఆయన మండలంలోని అన్ని పంచాయతీల్లో మార్చి 1వ తేదీ నుంచి సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 2021-2022 ఆర్థిక సంవత్సరంలో జరిగే పనులపై తనిఖీలు చేయడం జరుగుతుందని, సంబంధిత అధికారులు అందుబాటులో ఉండి, తనిఖీలకు సహకరించాలన్నారు. సమావేశంలో ఏపీఓ చిన్నప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: సచివాలయ ఉద్యోగులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులంతా బాధ్యతాయుతంగా పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని కూనాయవలస గ్రామసచివాలయాన్ని, పాఠశాలను సోమవారం సందర్శించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. అర్హులందరికీ పీఎంజేఏవై, రైస్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచి, శుచితో ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. వంటకాల్లో మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు.

ఘనంగా గ్రామదేవతల సంబరాలు ప్రారంభం


అమ్మవారి ఘటాలతో వెళ్తున్న మహిళలు

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో కొత్తపోలమ్మ, పాతపోలమ్మ, నూకాలమ్మ గ్రామదేవతల సంబరాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి ఉయ్యాల కంబాల సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించగా, సోమవారం తోలేళ్ల ఉత్సవం, అమ్మవారి ఘటాల ఊరేగింపు చేపట్టారు. తొమ్మిదేళ్లకోసారి ఈ గ్రామదేవతల పండగ జరుపుతుండగా, కోవిడ్ మహమ్మారి కారణంగా గత రెండేళ్ల పండగ చేయలేదు. ఈ నేపథ్యంలో దాదాపు 11 ఏళ్ల తర్వాత జరుగుతున్న సంబరాలు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొని, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు


భక్తులకు సూచనలిస్తున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: మండల కేంద్రంలో జరుగుతున్న చిన్నమ్మతల్లి జాతర మహోత్సవం నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ తిరుమలరావు తెలిపారు. సోమవారం స్థానిక బైపాస్ సెంటర్‌లోని జాతీయ రహదారిలో ఎస్ఐ సురేంద్రనాయుడుతో కలిసి ఆయన జాతరకు విచ్చేసే భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శాంతి భద్రతలకు పోలీస్ సిబ్బంది చేపట్టాల్సిన చర్యలను వివరించారు. శాంతియుత వాతావరణంలో జాతర జరిగేలా ప్రజలు సహకరించాలని, అనవసరంగా ఎవ్వరూ తగాదాలకు పాల్పడవద్దని సూచించారు.

భూముల రీసర్వేతో రైతులకు మేలు


డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి రూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా చేపడుతున్న భూముల రీసర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఎ.వెలగవలస గ్రామంలో డ్రోన్ సర్వేను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే సమయంలో రైతులు పొలాల వద్దనే ఉండి, సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. సర్వేలో ఏవైనా తప్పులున్నా వెంటనే అధికారులను సంప్రదించి, సరిచేసుకోవాలన్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

రాజాం సిటీ: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని, గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన స్పందన ఫిర్యాదులు, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, తాగునీటి సమస్యపై సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లను బాగు చేయాలని తెలిపారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు పాటించండి


మాట్లాడుతున్న వైద్యాధికారులు

రామభద్రపురం: వేసవి కాలం సమీపిస్తుండడంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రజలు వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారులు దిలీప్‌కుమార్, ఏఎల్‌జీ శిరీష సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మీడియాతో మాట్లాడిన వారు చిన్నపిల్లలు ఎండల్లో తిరగకుండా చూడాలన్నారు. పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారంతా గొడుగు వాడాలని, టోపీ, తెల్లని కాటన్ దుస్తులు ధరించాలన్నారు. తరచూ మంచినీరు, నిమ్మకాయ నీరు, మజ్జిగ తాగాలన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న వేణుగోపాలనాయుడు

బొబ్బిలి రూరల్: మండలంలోని కేశాయవలస గ్రామంలో రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు సోమవారం భూమిపూజ చేశారు. రామభద్రపురం మండలంలోని బోరబంద గ్రామం వరకు జరిగే ఈ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాల మేర నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ బొడ్డవలస సర్పంచ్ పి.వెలంగణి, పార్టీ నాయకులు సీహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

వంగర: మండలంలోని నాలుగు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సందర్శించిన ఆయన అక్కడ అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ఆధార్ అప్‌డేషన్ కోసం ప్రజలు గంటల తరబడి కేంద్రాల వద్ద వేచి చూడాల్సిన దుస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రక్రియను వేగవంతం చేసుకోవాలన్నారు. ప్రజల సౌకర్యార్థం వంగర, అరసాడ, కొప్పరవలస, కింజంగి గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

ఆధార్ సేవలపై ఆరా..

సంతకవిటి: మండల కేంద్రంలోని సచివాలయంతో పాటు సరిపురం, హొంజరాం గ్రామ సచివాలయాల్లో అందిస్తున్న ఆధార్ సేవలపై ఎంపీడీఓ ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి సోమవారం ఆరాతీశారు. ప్రజల ఆధార్ అప్‌డేషన్‌ను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

రేగిడి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు రక్తహీనత బారినపడకుండా ఉండేందుకు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని రాజాం సీడీపీఓ సిమ్మాలమ్మ సూచించారు. సోమవారం మండలంలోని చాటాయవలస గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమైన ఆమె కేంద్రానికి వచ్చే లబ్ధిదారులకు ప్రతిరోజూ పౌష్టికాహారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో వన్నలి, వండానపేట, ఉప్పరనాయుడువలస, చాటాయవలస, కేఎం వలస గ్రామ అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రకళ, జయలక్ష్మి, రాణి, భాను, రత్నాలమ్మ పాల్గొన్నారు.